క్లుప్తంగా

కల్యాణం.. కమనీయం



కల్యాణమూర్తులుగా స్వామి, అమ్మవార్లు

చింతకొమ్మదిన్నె : మండలంలోని కొత్తపేట గంగమ్మ దేవస్థానం ఆవరణలోని వీరభద్ర స్వామి ఆలయంలో సోమవారం వీరభద్ర స్వామి, భద్రకాళి అమ్మవార్ల కల్యాణం ఆలయ నిర్వాహకులు లింగారెడ్డి ఆధ్వర్యంలో కమనీయంగా నిర్వహించారు. దాతల సహకారంతో నిర్వహించిన కల్యాణోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కులుములపల్లి మాజీ సర్పంచ్ మహేంద్రరెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

పార్టీ బలోపేతానికి కృషి



చాగలేటి భాస్కర్

వేముల : వైఎస్సార్‌సీపీ బలోపేతం కోసం కృషి చేస్తానని ఆ పార్టీ పులివెందుల నియోజక వర్గ దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు చాగలేటి భాస్కర్ తెలిపారు. మండలంలోని చాగలేరు గ్రామానికి చెందిన చాగలేటి భాస్కర్‌ను వైఎస్సార్‌సీపీ దివ్యాంగుల నియోజకవర్గ అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ పదవిని కట్టబెట్టిన వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి వైఎస్ భాస్కర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు వైఎస్ మనోహర్‌రెడ్డి, వైఎస్ మధురెడ్డి, దేవిరెడ్డి శివ శంకర్‌రెడ్డి, వేముల మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

ముద్దనూరు: మండలంలోని చెన్నారెడ్డిపల్లె గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని, ప్రాథమిక పాఠశాలను మండల పరిషత్ అభివృద్ధి అధికారి ముకుందరెడ్డి సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ పాఠశాలలోని మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మెనూ ప్రకారంగా భోజనం వడ్డిస్తున్నారా, లేదా అనే అంశాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. భోజన నాణ్యతను ఉపాధ్యా యులు తప్పకుండా పర్యవేక్షించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లల సంఖ్య, వారికి అందించే పోషకపదార్థాలను పరిశీలించారు. అనంతరం గ్రామంలో ఉపాధి హామీ పథకంలో చేపట్టిన రహదారి పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పీఆర్ ఇన్‌చార్జి ఏఈ మునికుమార్ తదితరులు పాల్గొన్నారు.

1న బండలాగుడు పోటీలు

చింతకొమ్మదిన్నె : కొత్తపేట గంగమ్మ దేవత జాతర సందర్భంగా దేవస్థానం ఆధ్వర్యంలో భక్తుల సహకారంతో అఖిల భారత సీనియర్ విభాగపు బండలాగుడు పోటీల ప్రదర్శన మార్చి ఒకటో తేదీన మధ్యాహ్నం 12 గంటల నుంచి నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గెలుపొందిన ఎద్దుల యజమానులకు మొదటి బహుమతిగా 80 వేల రూపాయలు నగదు, రెండవ బహుమతి రూ. 60,000, మూడో బహుమతిగా 40,000, నాలుగవ బహుమతి రూ. 30,000 అందించనున్నామన్నారు.

నివాళి



వెంకటసుబ్బారెడ్డి మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

చింతకొమ్మదిన్నె : మండలంలోని లింగారెడ్డిపల్లెకు చెందిన చింతకొమ్మదిన్నె మండల ఉపాధ్యక్షుడు జి.వి.సుధాకరరెడ్డి తండ్రి గజ్జల పెద్ద వెంకటసుబ్బారెడ్డి (75) అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందారు. సోమవారం ఉదయం విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పి.రవీంద్రనాథరెడ్డి లింగారెడ్డిపల్లెకు వెళ్లి పెద్దవెంకటసుబ్బారెడ్డి మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం సుధాకర్‌రెడ్డితోపాటు ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే ప్రముఖ వైద్యులు కృష్ణకిషోర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, టీడీపీ నాయకులు, మండల ప్రజాప్రతినిధులు పెద్దవెంకటసుబ్బారెడ్డి మృతదేహాన్ని సందర్శించి, కుటుంబసభ్యులను పరామర్శించారు.

భర్తతోపాటు ఐదుగురిపై కేసు

కడప అర్బన్ : నగరంలోని తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో బాలాజీనగర్‌లో నివాసం వుంటూ ఓ యూట్యూబ్ చానెల్‌లో యాంకర్‌గా విధులను నిర్వహిస్తున్న ప్రసన్న అనే మహిళకు, బద్వేల్‌కు చెందిన శ్రీనివాసులుకు 12 సంవత్సరాల క్రితం వివాహమైంది. వీరి మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. ఈ క్రమంలో తనను భర్త, బంధువులు వేధిస్తున్నారని బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు భర్తతో పాటు, ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

సంగమేశ్వరుని దర్శనం.. సకల పాపహరణం

- మూడు నదులు కలిసే పుణ్యక్షేత్రం
- మహాశివరాత్రికి ముస్తాబైన సంగమేశ్వరాలయం
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- ఉత్సవాలకు ప్రత్యేక బస్సులు

వీరపునాయునిపల్లె: మండల పరిధిలోని పాపాఘ్ని, మొగమూరు, పావని నదుల సంగమంలో వెలసిన సంగమేశ్వరుని దర్శనం చేసుకుంటే సకల పాపాలు హరించుకుపోతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఈ ప్రాంతంలో అగస్త్య మహాముని శివలింగం ప్రతిష్ఠించినట్లు ఆలయ పురాణాలు చెబుతున్నాయి. ఆలయం తూర్పు భాగంలో మూడు నదుల సంగమం, ఉత్తరాన పెద్ద మడుగు (సంగాలమడుగు) దక్షిణ బాగాన ఎత్తైన కొండ, ఆలయ గోపురాలపై ఉన్న శిల్ప సౌందర్యంతో పాటు ఆలయ పరిసర ప్రాంతాల్లోని అందాలను తప్పక వీక్షించాల్సిందే.

వైఎస్సార్ హయాంలో..

వీరపునాయునిపల్లెకు 5 కిలోమీటర్ల దూరంలో ఈ ఆలయం ఉంది. ప్రతి ఏడాది కార్తీక మాసం నాలుగు సోమవారాలు, మహాశిరాత్రి పర్వదినాల్లో ఈ ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకొంటుంటారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అంచెలంచెలుగా ఆలయం అభివృద్ధి



ప్రత్యేక అలంకరణలో సంగమేశ్వరుడు

చెందింది. స్వామిని దర్శించుకొనేందుకు వచ్చిన భక్తులు విశ్రాంతి తీసుకొనేందుకు వీలుగా ఏపీ టూరిజం అతిథి భవనాన్ని ఆయన ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే నిర్మించారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి

మహాశివరాత్రి పండుగ సందర్భంగా ఆలయ పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించామని మండల పంచాయతీ అభివృద్ధి అధికారి పులిరామ్‌సింగ్ తెలిపారు. బుధవారం, గురువారం రెండురోజులు సిబ్బందితో ప్రత్యేక క్యాంపు కూడా ఏర్పాటు చేయడం చేస్తున్నామని. భక్తులు కూడా సహకరించాలని ఆయన కోరారు. శివరాత్రి పండుగను పురస్కరించుకొని



ముస్తాబయిన ఆలయ గాలి గోపురం

స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ ఇన్‌చార్జి ధర్మకర్త మురళీమోహన్‌రెడ్డి ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో చలువ పందిళ్లు ఏర్పాటు చేయడంతో పాటు వాహనాల కోసం పార్కింగ్ ఏర్పాటు చేశారు.

స్పెషల్ బస్సులు

సంగమేశ్వర స్వామిని దర్శించుకొనేందుకు ప్రొద్దుటూరు, కడప, పులివెందులకు చెందిన ఆర్టీసి అధికారులు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయనున్నారు. బుధవారం ఉదయం నుంచి గురువారం మధ్యాహ్నం వరకు బస్సులు భక్తులకు అందుబాటులో ఉంచనున్నారు.

శివరాత్రి ఉత్సవాలు ప్రారంభం

పెండ్లిమర్రి: మండలంలోని నందిమండలం గ్రామ సమీపంలోని పాపాఘ్నినది ఒడ్డున వెలసిన శివాలయంలో సోమవారం మహాశివ రాత్రి ఉత్సవాలు వేదపండితుల ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. తెల్లవారుజామున వేదపండితులు శివ పార్వతులకు కుంకుమార్చన, ఆకుపూజ, అభిషేకాలు నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి రవి బృందం వారిచే చెక్కభజన ఏర్పాటు చేశారు.



ప్రత్యేక అలంకరణలో శివలింగం

ప్లాస్టిక్ నివారణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ మేరి

కమలాపురం: కమలాపురం పట్టణ పరిధిలో ప్లాస్టిక్‌ను నివారించేందుకు అందరూ బాధ్యతగా తీసుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ మార్పురి మేరి పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ పగడాల జగన్నాథ్ అధ్యక్షతన వ్యాపార సంస్థల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్లాస్టిక్ నిషేధానికి వ్యాపారులు కూడా సహకరించాలని కోరారు. ప్లాస్టిక్ కవర్లు, ప్లేట్లు, గ్లాసులు, కప్పులు వాడటం వలన కాలుష్యం పెరిగిపోతుందని తెలిపారు. దీనిని దృష్టిలో ఉంచుకుని 2025 మార్చి ఒకటో తేదీ నుంచి కమలాపురం మున్సిపాలిటీ పరిధిలో చేపట్టిన ప్లాస్టిక్ నిషేధానికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. అపుడే ప్లాస్టిక్‌ను సంపూర్ణంగా నిషేధించవచ్చన్నారు. కమిషనర్ జగన్నాథ్ మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు బదులుగా జ్యూట్ బ్యాగులు, పేపర్ బ్యాగులు, కప్పులు, ప్లేట్లు వినియోగించాలని సూచించారు. మున్సిపల్, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

పార్టీలో కష్టపడే వారికి ఉన్నత పదవులు



ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి

పులివెందుల రూరల్ : వైఎస్ఆర్‌సీపీలో కష్టపడే వారికి ఉన్నతమైన పదవులు లభిస్తాయని కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీలో పలువురికి పదవులు ఇవ్వడం జరిగిందన్నారు. పులివెందుల పట్టణంలోని నగరిగుట్టకు చెందిన లక్ష్మీప్రసన్నదేవికి రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా బాధ్యతలు అప్పగించారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా పార్టీలో కష్టపడిన వారికి ఉన్నతమైన పదవులను పార్టీ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి ఇచ్చారని తెలిపారు. పదవులు పొందిన వారందరూ కష్టపడి పనిచేసి పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న తన నివాసంలో వైఎస్ అవినాష్‌రెడ్డిని రాష్ట్ర జాయింట్ సెక్రటరీ పదవి పొందిన లక్ష్మీప్రసన్నదేవితోపాటు వైఎస్సార్‌సీపీ నాయకులు, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ హాఫీజ్, హాలు గంగాధర్ రెడ్డి, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ చిన్నప్ప, కౌన్సిలర్లు కలిసి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు ఒక మాట, వచ్చిన తర్వాత మరొక మాట చెబుతున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రజలకు అబద్ధపు హామీల చెప్పి వాటిని నెరవేర్చకుండా కాలం వెల్లదీస్తున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వాన్ని నమ్మే పరిస్థితుల్లో రాష్ట్ర ప్రజలు లేరని పేర్కొన్నారు. పార్టీ కోసం ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేసి అధికారంలోకి వచ్చేందుకు వంతు కృషి చేయాలని కోరారు.

ఆర్టీసీ బస్టాండును త్వరగా ప్రారంభించండి

వేంపల్లె : వేంపల్లె ఆర్టీసీ బస్టాండును త్వరగా ప్రారంభించాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ మహేశ్వర్ రెడ్డి కోరారు. సోమవారం కడపలోని ఆర్టీసీ ఆర్ఎం గోపాల్‌రెడ్డిని వారు కలసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేంపల్లెలో బస్టాండు నిర్మాణం పూర్తి అయి నాలుగు నెలలు దాటినా ప్రారంభించకపోవడంతో ప్రయాణీకులు, ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఆర్టీసీ ఆర్ఎం గోపాల్‌రెడ్డి స్పందిస్తూ ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సాధ్యమైనంత త్వరలో ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.



ఆర్టీసీ ఆర్ఎం గోపాల్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

సింహాద్రిపురం : ప్రకృతి వ్యవసాయం లాభదాయకమని, రైతులకు ఈ విధానంపై అవగాహన కల్పించాలని మండల వ్యవసాయాధికారి శివమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రమైన సింహాద్రిపురం రైతు సేవా కేంద్రంలో ఐసీఆర్పీలకు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ చిన్న, సన్న కారు రైతులతో ప్రకృతి వ్యవసాయం చేయించాలని సూచించారు. అలాగే నాటుకోళ్ల పెంపకంపై అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో సంపూర్ణ ఆరోగ్యంతో జీవించవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది శ్రీనివాసులు, రామకృష్ణ, సుబ్బరాయుడు, రమణ, ఐసీఆర్పీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మండల వ్యవసాయాధికారి శివ

కడుపు చల్లకుండ..

- మార్కెట్‌లోకి పేదవాడి ఫ్రిజ్‌లు
- పెరుగుతున్న ఆదరణ

మట్టికుండలు అనాదిగా వాడుకలో ఉన్నాయి. అల్యూమినియం, స్టీల్, ఇతర పాత్రలు వాడుకలోకి రావడంతో మట్టి కుండలకు ఆదరణ క్రమక్రమంగా తగ్గింది. ఆధునిక వంట పాత్రల వాడకం ద్వారా రోగాలు ప్రజలను చుట్టుముడుతున్నాయనే భావనతో మరల ప్రజలు మట్టికుండల వైపు మొగ్గుచూపుతున్నారు. వేసవిలో మట్టి కుండలో నీళ్లు తాగడానికే ఎక్కువగా ఇష్టపడుతున్నారు. పులివెందుల పట్టణంలోని పార్నపల్లె రోడ్డులోని సిండికేట్ బ్యాంక్ సమీపంలో మట్టికుండలను విక్రయానికి సిద్ధంగా ఉంచారు. పట్టణవాసులు కూడా వాటిని కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఫ్రిజ్‌లు అధికశాతం మందికి ఉన్నా ఫ్రిజ్ నీరు తాగితే అనారోగ్యం బారిన పడుతామని కుండనీటిని ఆశ్రయిస్తున్నారు. ఈ కుండల్లో నీరు తాగితే దప్పిక తీరడంతో ఆల్కలిన్ లక్షణాలు, నీటి పీహెచ్ స్థాయిలను సమతుల్యం చేస్తాయని ప్రజలు పేర్కొంటున్నారు.

–పులివెందుల రూరల్



విక్రయానికి సిద్ధంగా ఉన్న మట్టి కుండలు

సేంద్రియ సాగుతో అధిక దిగుబడి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఆర్. వెంకట సునీల్‌కుమార్‌రెడ్డి

ఎర్రగుంట్ల : రైతుల సేంద్రియ పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి వస్తుందని సేంద్రియ ఉత్పత్తుల ధ్రువీకరణ రాష్ట్ర అధికారి ఆర్. వెంకట సునీల్ కుమార్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఎర్రగుంట్ల మండలం పరిధిలోని హనుమనుగుత్తి గ్రామంలో చేసిన శనగ పంటను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సేంద్రియ పద్ధతిలో పండించిన శనగకు మార్కెట్. ధరకన్నా 20 శాతం అధిక ధర లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి శ్రీకాంత్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

పన్ను వసూళ్లపై దృష్టి సారించండి



రికార్డులను పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ తిమ్మక్క

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని గ్రామ పంచాయతీల్లో పెండింగ్‌లో ఉన్న ఇంటి, లైసెన్స్ ఫీజులు వసూళ్లపై దృష్టి సారించాలని జమ్మలమడుగు డీఎల్‌పీఓ తిమ్మక్క అన్నారు. సోమవారం పోట్లదుర్తి గ్రామంలోని గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మార్చి 15వ తేదీలోపు వంద శాతం పన్నులు వసూళ్లు చేయాలని ఆదేశించారు. అలాగే గ్రామాల్లో పారిశుద్ధ్యంపై కూడా దృష్టి సారించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పెద్దనరసింహులు, ఈఓపీఆర్‌డీ రంతుల్లయ్య, పంచాయితీ కార్యదర్శి జాఫర్ పాల్గొన్నారు.

మహాధర్నాను జయప్రదం చేయండి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు, యూనియన్ నాయకులు

జమ్మలమడుగు: విజయవాడలో అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం కోసం మార్చి 10వ తేదీన నిర్వహిస్తున్న మహాధర్నాను జయప్రదం చేయాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ కార్యదర్శి భాగ్యలక్ష్మి పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక పతంగే రామన్నరావు హైస్కూల్ ఆవరణంలో మహాధర్నాకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఆమెమాట్లాడుతూ అంగన్‌వాడీలకు కనీసం రూ. 26 వేలు వేతనం, గ్రాడ్యూటీ అమలు చేయాలని, మినీ అంగన్‌వాడీలను ప్రధాన సెంటర్లుగా మార్చుతూ ప్రభుత్వం వెంటనే జీఓ విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

నూతన వీసీకి సన్మానం

కడప కోటిరెడ్డిసర్కిల్ : యోగి వేమన విశ్వవిద్యాలయం నూతన వైస్ చాన్సలర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆచార్య ప్రకాశ్ బాబును వైవీయూ నాన్ టీచింగ్ ఉద్యోగులు సోమవారం ఘనంగా సన్మానించారు. నాన్ టీచింగ్ స్టాఫ్ ప్రెసిడెంట్ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో తిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామి లడ్డూ, వడలు అందజేసిపట్టు వస్త్రాలతో సత్కరించారు.

ఉద్యోగులను నిరాశపర్చిన గవర్నర్ ప్రసంగం

ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సంగమేశ్వరరెడ్డి



వేంపల్లె: శాసనసభ బడ్జెట్ సమావేశాల తొలిరోజు ఉభయ సభలనుద్దేశించి ప్రసంగించిన గవర్నర్ ప్రసంగంలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల, ఉపాధ్యాయుల ఆర్థిక అంశాలపై ప్రస్తావన లేకపోవడం దురదృష్టకరమని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నర్రెడ్డి సంగమేశ్వర రెడ్డి పేర్కొన్నారు. సోమవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ ఏర్పాటులో ప్రముఖ పాత్రను రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులు పోషించారని, అలాగే ఉద్యోగుల ఆకాంక్షలైన వేలకోట్ల రూపాయల బకాయిల చెల్లింపు, 12వ వేతన సవరణ ఏర్పాటుపై గవర్నర్ ప్రసంగంలో లేకపోవడం శోచనీయమన్నారు. అలాగే కమిషన్ నియామకం, మధ్యంతర భృతి ప్రకటన, కేంద్రం యూపీఎస్ ప్రకటించిన పరిస్థితులలో గత పాలకులు ప్రకటించిన జీపీఎస్ విధానాలను సమీక్షించడం అనేది కూడా లేదన్నారు. సీపీఎస్ రద్దు చేసి ఉద్యోగులకు పదవి విరమణ అనంతరం ఆర్థిక భరోసా కల్పించేలా పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసే ప్రకటన కూడా చేయలేదని విమర్శించారు. ఆర్థికపరమైన అంశాలపై చర్చిస్తారని ఎన్నో ఆశలతో ఉన్న రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు గవర్నర్ ప్రసంగంలోనే ప్రభుత్వం నిరాశ పరిచిందన్నారు. ఆరు నెలలపాటు పాలనా పరమైన సమస్యలను అధిగమించి అనంతరం ఉద్యోగులకు న్యాయం చేసే ప్రయత్నం చేస్తారని ఆశించారని, కాని వచ్చే ఏడాది కోసం రూపొందించే బడ్జెట్‌లో ఉద్యోగుల ఆర్థిక సమస్యలకు ఒక పరిష్కారం దొరుకుతుందని ఎంతో ఆశగా ఎదురుచూడగా, ఆశలు అడియాశలయ్యాయన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి పోరాటమే శరణ్యమని పేర్కొన్నారు.

ఆర్థికంగా ఆదుకోండి సారూ..

కమలాపురం: గొర్రె పిల్లలను మేపుకుంటూ వాటిని విక్రయించుకుంటూ జీవనం సాగిస్తున్న తమను ఆదుకోవాలని సి.గోపులాపురానికి చెందిన చల్ల సుబ్బయ్య, గొర్ల ఓబయ్య తహసీల్దార్‌ను వేడుకున్నారు. సోమవారం తహసీల్దార్ శివరామిరెడ్డిని కలసి వారు వినతి పత్రం అందజేశారు. ఆదివారం కుక్కల దాడిలో 53 గొర్రె పిల్లలు మృతి చెందాయి. తాము గొర్లను సాకుతూ.. వాటిని విక్రయించుకుంటూ జీవనం సాగిస్తున్నామని, ఒక్క సారిగా 53 గొర్రె పిల్లలు మృతి చెందడంతో తీవ్రంగా నష్టపోయామని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నష్ట పరిహారం అందేలా చూడాలని వారు కోరారు. స్పందించిన తహసీల్దార్ శివరామిరెడ్డి మాట్లాడుతూ గొర్రె పిల్లలు మృతి చెందిన ఘటనను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేసేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

వేగవంతం చేయండి

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతులకు విశిష్ట సంఖ్యను నమోదు చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని మండల తహసీల్దార్ శివరామిరెడ్డి ఆదేశించారు. సోమవారం స్థానిక తన కార్యాలయంలో నిర్వహించిన రెవెన్యూ, అగ్రికల్చర్ సిబ్బంది సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆధార్ లాగే భూమి ఉన్న ప్రతి రైతుకు విశిష్ట సంఖ్య కేటాయించాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. రెవెన్యూ, అగ్రికల్చర్ సిబ్బంది సమన్వయంతో పని చేసి రెండు రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. మండలంలోని ప్రతి రైతుకు ఈ విశిష్ట సంఖ్య అందేలా రైతు రిజిస్ట్రీలో నమోదు చేయాలన్నారు. రైతులకు ఎలాంటి సంక్షేమ పథకాలు అందాలన్నా ఈ సంఖ్యను ప్రామాణికంగా తీసుకునే అవకాశం ఉందని తెలిపారు. ఏఓ సరస్వతి, రెవెన్యూ, అగ్రికల్చర్ సిబ్బంది పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బాధితులు

పరిహారంతో పాటు మౌలిక వసతులు కల్పించాలి


కొండాపురం: గండికోట జలాశయం నిర్మించి పదేళ్లు కావస్తున్నా ఇప్పటికీ పూర్తిగా పరిహారంతో పాటు పునరావాస కాలనీల్లో మౌలిక వసతులు కల్పించలేదని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర పేర్కొన్నారు. వెంటనే వీరికి న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సోమవారం ఓబన్నపేట పునరావాస కాలనీలో నిర్వాసితులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే నిర్వాసితులైన పేదలకు రెండు ఎకరాల భూమి ఇస్తామని, అదనంగా నిర్వాసితులకు రూ.2లక్షలు ఇస్తామని చెప్పి ఎనిమిది నెలలు కావస్తున్నా ఇప్పటి వరకు ఇవ్వలేదన్నారు. తొలి విడత గ్రామాలకు ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో స్మశాన వాటిక స్థలం, తాగునీటి సమస్య ఉందన్నారు. రెండో విడత గ్రామాలకు ఏర్పాటు చేసిన పునరావాస కాలనీలో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ పూర్తిగా నిర్మించలేదన్నారు. నిర్వాసితులకు ఉపాధి కోసం మండల కేంద్రంలో ఓ చిన్న పరిశ్రమ నిర్మించాలని కోరారు. ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సుబ్బారెడ్డి, ఉపాధ్యక్షుడు రఘునాథరెడ్డి, సీపీఐ మండల కార్యదర్శి మనోహర్‌బాబు, వెంకటరమణ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర

గ్రామ పంచాయతీలో ఎలాంటి అవినీతి చేయలేదు

పంచాయతీ కార్యదర్శి నిమ్మకాయల వెంకట సుబ్బారెడ్డి



వేంపల్లె : వేంపల్లె గ్రామ పంచాయతీలో ఎలాంటి అవినీతికి పాల్పడలేదని పంచాయతీ కార్యదర్శి నిమ్మకాయల వెంకట సుబ్బారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయని, వాటిలో నిజం లేదన్నారు. పంచాయతీ రాజ్ కమిషనర్ కృష్ణతేజ ఆదేశాల మేరకు అధికారులు గ్రామ పంచాయతీపై విచారణ చేసిన విషయం మాత్రం వాస్తవమేనని, కానీ అవినీతి జరగలేదన్నారు. ఉద్దేశపూర్వకంగా గ్రామ పంచాయతీ పేరును చెడగొట్టాడానికే అవినీతి జరిగినట్లు ఆరోపణలు చేశారన్నారు. జీతాలు కూడా ప్రతి నెలా ఉద్యోగులకు ఇస్తున్నట్లు తెలిపారు. ఆర్థికంగా అవినీతి జరిగి ఉంటే ఉద్యోగులకు జీతాలు ఇచ్చే పరిస్థితి కూడా ఉండదన్నారు. టీడీపీలో వర్గ పోరు ఉండడంతో ఒక వర్గం వారు మాత్రం పనిగట్టుకొని గ్రామ పంచాయతీలో అవినీతి జరిగిందని పంచాయతీ రాజ్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారని తెలిపారు. వేంపల్లె మేజర్ పంచాయతీలో టీడీపీలో రెండు వర్గాలు ఉండడంతో గ్రామపంచాయతీలో కాంట్రాక్టు పద్ధతిన ఉద్యోగాలు ఇవ్వాలని తనపై ఒత్తిడి తెచ్చారన్నారు. అయితే మొదట ఒక వర్గం వారు లిస్ట్ పంపించారని, మరో వర్గం కూడా కొంతమంది పేర్లను ఇచ్చారన్నారు. అయితే గ్రామ పంచాయతీకి అంతంతమాత్రంగా నిధులు ఉండడంతో టీడీపీలోని రెండు వర్గాలకు న్యాయం చేయలేమని కొంత సమయం కావాలని కోరానని చెప్పారు. దీంతో అవినీతి జరిగిందంటూ ఆరోపణలు చేస్తున్నారని ఆయన వివరించారు.

యువతిని మోసం చేసిన యువకుడిపై కేసు

కడప అర్బన్ : కడప నగరానికి చెందిన ఓ యువతిని ప్రేమపేరుతో మోసం చేసిన యువకుడిపై కేసు నమోదు చేసినట్లు కడప ఒన్‌టౌన్ పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. కడపకు చెందిన యువతి ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో పని చేస్తుండేది. కర్నూలు జిల్లాకు చెందిన యువకుడు అదే ఆసుపత్రిలో పని చేస్తుండే వాడు. యువతిని ప్రేమించానంటూ తిరుగుతూ పెళ్లి పేరుతో మోసం చేశాడు. బాధితురాలు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.